## వృద్ధురాలు ఆత్మహత్య



**ప్రజాపక్షం/నర్వ:** నారాయణపేట జిల్లా నర్వ మండలం పాతర్‌చేడ్ గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ పబ్బతి రమేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాతర్‌చేడ్ గ్రామానికి చెందిన రోడ్డపొల్ల సాయమ్మ అలియాస్ కొత్తపల్లి సాయమ్మ (63) మే 1వ తేదీన గ్రామంలో జరిగిన శ్రీ ఆంజనేయ స్వామి ఉత్సవాల సందర్భంగా శనివారం రాత్రి గుడిలోనే నిద్ర చేస్తానని తన కుటుంబ సభ్యులకు తెలిపింది. అయితే కుటుంబ సభ్యులు శనివారం వద్దు, మంగళవారం రోజు వెళ్లమని సూచించారు. ఈ విషయంలో మనస్తాపానికి గురైన సాయమ్మ మే 2వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి బయటికి వెళ్లిపోయింది. ఆమె గుడికే వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు భావించారు. కాగా, ఆదివారం ఉదయం గ్రామంలోని చెరువులో ఒక గుర్తు తెలియని మహిళ శవం తేలుతున్నట్లు సమాచారం రావడంతో, సాయమ్మ కుమారుడు రోడ్డపొల్ల నరసింహులు అక్కడికి వెళ్లి చూడగా, అది తన తల్లి సాయమ్మ మృతదేహంగా గుర్తించాడు. గుడికి వెళ్లే విషయంలో గొడవ జరగడంతో మనస్తాపం చెంది సాయమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు కుమారుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. తమకు ఎవరిపైనా అనుమానం లేదని ఆయన తెలిపారు. నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పబ్బతి రమేష్ వెల్లడించారు.

## ఏదుట్లలో ఎల్లమ్మ పండుగలు

**ప్రజాపక్షం/గోపాల్‌పేట:** గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామంలో ఎల్లమ్మ దేవత పండుగలు ఎంతో వైభవంగా నిర్వహించబడ్డాయి. కొమ్మే సంగణమోని ముదిరాజ్ సమాజానికి చెందిన గ్రామస్తులు తరతరాలుగా కొనసాగిస్తున్న ఈ సంప్రదాయ పూజలను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో భక్తులు అమ్మవారికి ఒక్కపొద్దులతో నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. శక్తి పూజారి బైండ్ల దామోదర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అమ్మవారికి గంగస్నానం చేయించి, పుట్టబంగారుతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా సాగిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఈ కార్యక్రమంలో బైండ్ల శక్తి పూజారి దామోదర్, కొమ్మే బిచ్చయ్య, మద్దిలేటి కోటేష్, జైపాల్, లక్ష్మి, విష్ణు, రాములు, సంగనమోని బిచ్చయ్య, కొమ్మే మహేష్, తదితరులు ఉన్నారు.

## జడ్చర్లలో 'పాలమూరు రన్' సక్సెస్




**ప్రజాపక్షం/జడ్చర్ల:** తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో జడ్చర్లలో ఘనంగా పాలమూరు రన్ విజయవంతం అయ్యింది. దాదాపు 600కు పైగా రన్నర్స్ అన్ని వయసుల వారు హుషారుగా పాల్గొన్నారు. జుంబా వార్మప్‌తో ప్రారంభం అయిన పరుగు తర్వాత డా.శివకాంత్ సిపిఆర్ డెమో ప్రదర్శించారు. 2కె,5కె మరియు 10 కె విభాగంలో పరుగు జరిగింది. ఈ రన్ ఉమ్మడి పాలమూరు జిల్లా వాసులతో పాటు హైదరాబాద్‌కు చెందిన రన్నర్స్ కూడా పాల్గొన్నారు. పాలమూరు జిల్లాలో తొలిసారిగా జరిగిన ఈ రన్ ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడంతో నిర్వాహకులు తెలంగాణ రన్నర్స్ జడ్చర్ల రన్నర్స్ ప్రజలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జూన్ 7వ తేదీన హైదరాబాదులో జరిగే తెలంగాణ రన్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈరన్‌లో జడ్చర్ల ఎస్ఐ ఖాదర్, డా.శివకాంత్, డా.దినేష్ తెలంగాణ రన్నర్స్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, రవి సాంబారితో పాటు నిర్వాహకులు రామకృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

## కార్మిక రాజ్యాధికారమే కమ్యూనిజం లక్ష్యం: బి.బాలకిషన్




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** దోపిడి లేని సమాజ నిర్మాణం కావాలంటే బలమైన కార్మిక వర్గ పోరాటాలతో కార్మిక వర్గం రాజ్యాధికారం చేపట్టడమే కమ్యూనిజం లక్ష్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ కార్మిక విభాగాల 2026 సంవత్సర పార్టీ శాఖ సభ్యత్వాల జాబితాలను, సభ్యత్వ రుసుములను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. సురేష్ నేతృత్వంలో ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి. బాలకిషన్ కి అందజేశారు. అనంతరం ఏఐటీయూసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి. బాలకిషన్ మాట్లాడుతూ కార్మిక వర్గ దృక్పథం కార్మిక రాజ్య స్థాపన సిద్ధాంతంతో ప్రపంచవ్యాప్తంగా ఏకైక రాజకీయ నేపథ్యం కలిగిన ఒకే ఒక్క పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. దేశ సంపద ఉత్పత్తికి సాధనాలు కార్మిక శక్తి అని కార్మికుల లేకపోతే దేశ అభివృద్ధి లేదని అన్నారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన కార్మిక శక్తి పాలకుల ద్వంద రాజకీయ విధానం ఫలితంగా శ్రమ దోపిడికి గురవుతుందని అన్నారు. కార్మిక పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడు వెన్ను దన్నుగా ఉంటుందని కార్మిక వ్యతిరేక విధానాలపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి. సురేష్ మాట్లాడుతూ కార్మికులను రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకొని అధికార గద్దెనెక్కిన తర్వాత కార్మికులకు అన్యాయం చేసే శాసనాలకు రూపకల్పన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ వివిధ కార్మిక రంగాల కార్మిక జిల్లా నాయకులు రంగన్న , రాములు, నరసింహ, బాల వెంకటయ్య, యుగేందర్ రెడ్డి, ఆంజనేయులు, రాఘువేందర్, రామలింగం, ఏ. యాదయ్య, లోకేశ్వర్, నవీన్, తిరుపతి రెడ్డి, భూషణ్, ఎం.డి గఫార్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పెట దేవమ్మ మృతదేహానికి నివాళులు

**ప్రజాపక్షం/ నాగర్ కర్నూల్ :** సిపిఐ కోడేరు మండల కార్యదర్శి దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు తప్పెట కిరణ్ కుమార్ తల్లి సీనియర్ సిపిఐ సభ్యురాలు కామ్రేడ్ తప్పెట దేవమ్మ, ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు నిజమైన నివాళి అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన తప్పెట దేవమ్మ మృతదేహానికి ఎర్రజెండా తప్పి ఆమెకు అంతిమ నివాళులర్పించారు. ఫయాజ్ మాట్లాడుతూ..ఆమె మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆమె పట్టుదల పోరాట స్ఫూర్తి నేటి తరం నాయకులకు, కార్యకర్తలకు ఎంతో ఆదర్శమని ఆయన కొనియాడారు.నివాళులర్పించిన వాళ్లలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు ఆర్. ఇంద్ర, సిపిఐ కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మల శివుడు, పెద్దకొత్తపల్లి మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసు, కోడేరు మండల సహాయ కార్యదర్శి పసువుల గాలి కొల్లాపూర్ పట్టణ కార్యదర్శి ఎండి యూసుఫ్ , సిపిఐ నియోజకవర్గ నాయకుల సంఘం కృష్ణ, జి. వెంకటస్వామి వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# చివరి ధాన్యపు గింజ వరకూ కొనుగోలు చేస్తాం

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం/పెబ్బేరు :** అన్నదాతలు ఎవరు కూడా అధైర్యపడరాదని, వారు సాగుచేసిన వరి, మొక్కజొన్న పంటలను చివరిగింజ వరకు కొనుగోలు, చేస్తామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెబ్బేరు మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వారు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలలో విక్రయించవచ్చునని దళారుల మాటలు నమ్మే మోసపోకూడదని ఎమ్మెల్యే సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే అన్నదాతలకు ఎలాంటి సమస్యలు రానివ్వకుండా నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ధాన్యాన్ని విక్రయించిన అన్నదాతల పేర్లను వెంటనే నమోదు చేయాలని వారికి ధాన్యం విక్రయ సొమ్మును వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, పెబ్బేరు మార్కెట్ యార్డు అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు, పెబ్బేరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, నాయకులు శ్రీహరి రాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ సోమవారం ప్రజావాణి



**ప్రజాపక్షం/ అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం పుల్లూరు గ్రామ శివారు అయిన అలంపూర్ చౌరస్తాలో 4 నుంచి అలంపూర్ చౌరస్తా వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో ప్రతీ సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఆర్డీఓ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు హాజరు కానున్నారు. కావున అలంపూర్ మండలం ఉండవెల్లి, మానవపాడు మండల ప్రజలు ఈ ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులు ప్రభుత్వ అధికారులు స్వీకరించి, సిజిజి పోర్టల్ లో నమోదు చేసి 30 రోజుల్లో పరిష్కారం. సౌకర్యాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

## విద్యుత్ వైర్లు తగిలి గడ్డివాము దగ్ధం



**ప్రజాపక్షం/ ధరూర్ :** గ్రామ శివారులో ఆదివారం ట్రాక్టర్‌పై తరలిస్తున్న గడ్డికి విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైంది. గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన రైతులు పశువుల కోసం గడ్డిని జాంపల్లి గ్రామంలో కొనుగోలు చేసి ట్రాక్టర్ పై తరలిస్తుండగా జాంపల్లి గ్రామ శివారులో గల ర్యాలంపాడు కాలువ సమీపంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో డ్రైవర్, రైతులు తప్పించుకోగా గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటల ఆర్పారు.

# నేటి నుండి 9 వరకు రైతు వారోత్సవం

### కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుండి 9 వరకు రైతు వారోత్సవం నిర్వహించి రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. రైతు వారోత్సవంలో భాగంగా మొదటిరోజు నేల ఆరోగ్యం, పరిరక్షణ, సమతుల ఎరువుల యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, 5న ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు, 6న బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక వంట రుణా లు, సహకార సంఘాలు, ఎఫ్.పి.ఓ.ల ద్వారా రైతులకు సేవలు వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్ అవకాశాలు, 7న వ్యవసాయ క్షేత్రాలు సౌర విద్యుత్ కేంద్రాలుపి.ఎం. కుసుమ్, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్స్, 8న పశుసంవర్థక శాఖ, పాడి పరిశ్రమ పశుజాతి అభివృద్ధి, దూడల ప్రదర్శన, గడ్డి విత్తనాలు, వేసవిలో పశు సంరక్షణ మత్స్య శాఖ ద్వారా చెరువులలో కలుపు మొక్కలు నివారణ, వ్యాధుల నియంత్రణ, అధికోత్పత్తికి చర్యలు, నీటిపారుదల శాఖ ద్వారా సమర్థ నీటి విడుదల కొరకై గేట్ల నిర్వహణ, ఎతిపోతల పథకాల మరమ్మత్తులు, కాలువలలో కంపచెట్లు గుర్రపు డెక్క తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ వారీగా ప్రతి రోజూ ప్రజలు ప్రజా ప్రతినిధులు, రైతులను భాగస్వామ్యులను చేస్తూ వ్యవసాయ,ఉద్యానవన శాఖ, మత్స్య శాఖ, నీటి పారుదల శాఖ, పశు సంవర్ధక శాఖ, సహకార శాఖలు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# కార్మికుల హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వం

### సిపిఐ ఆధ్వర్యంలో 141వ మేడే ఉత్సవాలు



**ప్రజాపక్షం/అమరచింత:** 141 సంవత్సరాల క్రితం సాధించుకున్న 8 గంటల పని దినాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తూ 18 గంటలు పని చేయించుకుంటుందని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు ఆరోపించారు. అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలోని సిపిఐ జెండా కట్ట వద్ద ఆదివారం సిపిఐ ఆధ్వర్యంలో 141వ మేడే ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు శ్యాంసుందర్ మే డే ను పురస్కరించుకుని కార్మికులతో తలచిన ఎర్ర దుస్తులనే గుర్తు జెండాగా ఎగురవేశారు. ఈ సందర్భంగా విజయరాములు మాట్లాడుతూ 1886 లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసమే కార్మికులు పేద ఎత్తున ఉద్యమాన్ని లేవదీయగా అప్పుడు జరిపిన కాల్పుల్లో వందలాదిమంది మృతి చెందగా వారి రక్తంతోనే తడిసిన గుడ్డలనే నేడు ఎర్రజెండాతో మేడే ఉత్సవాలను జరుపుతున్నామని అన్నారు. నేడు నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యవసాయ కార్మికుల, రైతుల అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల శ్రమను దోచి కార్పోరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. నేడు దేశవ్యాప్తంగా రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలు పనిచేస్తున్న ఉపాధి కూలీలపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని ఆయన ఆందోళన చెందారు. ఆనాడు కార్మికులు చూపిన తెగువతో పాలక ప్రభుత్వాలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హక్కుల కోసం సిపిఐ నిర్వహించే ప్రతిపోరాటంలో కార్మికులు కర్షకులు కూలీలు కలిసి రావాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని విజయరాములు సూచించారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలను అలపించి పట్టణ ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, సిపిఐ నాయకులు లక్ష్మీ నారాయణ, ఎర్రన్న, రఘు, అంజి, సాలు తో పాటు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాలువలో పడిన వ్యక్తిని కాపాడిన 108 సిబ్బంది



**ప్రజాపక్షం/రేవల్లి:** హర్షద్ 21 సంవత్సరాలు మహారాష్ట్ర లాతూర్‌కు చెందిన హర్షద్ ఫ్యామిలీ లాతూర్ నుండి తిరుపతి వెళ్లి తిరిగి వస్తుండగా తోమాలపల్లి దగ్గర జూరాల కాల్వ దగ్గర వాళ్ల కుటుంబం వంటలు చేసుకుంటూ ఉండగా హర్షద్ అనే వ్యక్తి అక్కడ కాలువ దగ్గరికి వెళ్లాడు. వెంటనే ఫీట్స్ వచ్చి అతను కాలువలో పడిపోయాడు. కాలువలో బుడగలు రావడం చూసి ఏదో కాలువ లోపల కదులుతుందని ఒక అతను చూసి 108 కు సమాచారం ఇవ్వడం జరిగింది. 108 సిబ్బంది ఖాజా మరియు మాసుంబాబా అక్కడికి హుటాహుటిన చేరుకున్నారు. 108 సిబ్బంది అతను తల్లడిల్లడం చూసి కాలువలోకి దిగి అక్కడ ఎక్కడానికి కూడా రాని పరిస్థితులో అతనిని 300 మీటర్లు నీటిలో ఎత్తుకెళ్లి గడ్డకు చేర్చి అతని పరిస్థితి కొంచెం విషమంగా ఉండడంతో వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. 108 సేవలను హర్షత్ కుటుంబం కొనియాడారు.

# నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ



**ప్రజాపక్షం/ నాగర్ కర్నూల్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసి కార్మికుల పోరాడి సాధించుకున్న 29 చట్టాలను పునరుద్ధరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాల నరసింహ డిమాండ్ చేశారు. ప్రపంచ పోరాట చరిత్రలో ఎన్నో ఉద్యమాలు ఉన్నప్పటికీ, చికాగో నగరాన జరిగిన కార్మిక ఉద్యమం సువర్ణ అక్షరాలతో లెక్కించ తగ్గదని ఆయన అన్నారు. బిజినేపల్లి మండలం వెలుగొండ గ్రామంలో మేడే సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం. బాల నరసింహ పార్టీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఎన్నో ఉద్యమాలు పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, కార్మికులు మేడే స్ఫూర్తితో తమ హక్కుల సాధనకై జరిగే పోరాటంలో అగ్ర భాగాన నిలబడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈర్ల చంద్రమౌళి, సిపిఐ బిజినేపల్లి మండల సహాయ కార్యదర్శి ఈర్ల భూపేష్, వార్డు సిపిఐ, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్షా కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో పాలమూరు యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన నీట్ పరీక్ష కేంద్రాలను రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ మహబూబ్ నగర్ అర్బన్ తహసీల్దార్‌తో కలిసి ఆదివారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థుల ప్రవేశ సమయంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు మధ్య పరీక్షా ప్రశాంతంగా ముగిసింది. బయో మెట్రిక్ హాజరు నమోదు నిర్వహించడం, అడ్మిట్ కార్డ్ ధృవీకరణ, ఫోటో ఐ.డి. కార్డ్ తనిఖీ, అభ్యర్థులను తనిఖీ చేసి నిషేధిత వస్తువులు పరీక్షా కేంద్రంలోకి తీసుకు రాకుండా చర్యలు తీసుకున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సి. కెమెరా, పర్యవేక్షణ, భద్రతా, ఏర్పాట్లను గావించారు. విద్యార్థులకు తాగునీరు, వైద్య సదుపాయం మెడికల్ క్యాంప్, నిరంతర విద్యుత్ సరఫరాకు అన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# చికాగో పోరాటంతోనే.. మేడే ఉత్సవాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి. ఫయాజ్



**ప్రజాపక్షం/ పెద్దకొత్తపల్లి:** ప్రపంచ పోరాట చరిత్రలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు ఉన్నప్పటికీ చికాగో నగరాన జరిగిన కార్మిక ఉద్యమం పోరాటంతోనే మేడే ఉత్సవాలు జరునుకుంటునామని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్ అన్నారు. పెద్దకొత్తపల్లి మండలం నక్కల పల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మేడే వేడుకలను నిర్వహించారు. మేడే ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా ఎస్.ఎం.డి ఫయాజ్ పాల్గొని, ఎర్రజెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మికుల హక్కులను ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని కార్మికులు మే డే స్ఫూర్తితో తమ హక్కుల సాధనకై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహ, మండల కార్యదర్శి శ్రీనివాసులు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు మల్లేష్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, శాఖ కార్యదర్శి ఆంజనేయులు, మండల నాయకులు సంఘం కృష్ణ, పసుపుల గాలిన్న కృష్ణయ్య, కొండలు, చందు, నరసింహ, మధు, పర్వతాలు, బాలయ్య, పాల్గొన్నారు.

## ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్:** ఇక పై ప్రతీ సోమవారం ఆర్.డి.ఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్‌డిఓలను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాఫి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు. డివిజనల్ పంచాయితీ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ, వ్యవసాయ సహాయ సంచాలకులు, డిస్కాం డీఈలు, ఆర్ అండ్ బి, ఆర్ డబ్ల్యుఎస్, హౌసింగ్ డిఈఈలు, సీడీపీవోలు, సహాయ ఎస్సీ, ఎస్టీ, బీసీ అభివృద్ధి అధికారులు, డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకావాలని ఆదేశించారు. జిల్లా అధికారులందరూ వారి శాఖకు సంబంధించిన అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

# గద్వాల జిల్లాలో 'బెల్ట్' జోరు

### 8కి పైగా పంచాయతీల్లో అక్రమ మద్యం విక్రయాలు



**ప్రజాపక్షం/ గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలోని పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న బెల్ట్ షాపులు సామాన్యుడి బతుకును భారంగా మారుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న 80 కి పైగా గ్రామ పంచాయితీల్లో అక్రమ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఒక్కో పంచాయతీ పరిధిలో సగటున 3 నుంచి 5 బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటం గమనార్హం. ప్రభుత్వ మద్యం దుకాణాలు కేవలం పట్టణాలు, మండల కేంద్రాలకే పరిమితం కావాల్సి ఉండగా, అక్కడి నుంచి మద్యం సేకరించి గ్రామాల్లోని గల్లీ గల్లీలోనూ విక్రయిస్తున్నారు. మద్యం బాటిళ్ల పై ఉన్న ధర (ఎంఆర్‌పి) కంటే రూ. 30 నుంచి రూ. 40 వరకు అదనంగా వసూలు చేస్తూ నిర్వహకులు జేబులు నింపుకుంటున్నారు. ప్రభుత్వ దుకాణాల సమయంతో సంబంధం లేకుండా, తెల్లవారుజాము నుంచే ఈ బెల్ట్ షాపులు దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లోనే మద్యం సులభంగా అందుబాటులో ఉండటంతో కూలీలు, యువత అధికంగా వ్యసనాల బారిన పడుతున్నారు. రోజువారీ కూలీ ద్వారా వచ్చే సంపాదనలో అధిక భాగం మద్యానికే ఖర్చవుతుండటంతో నిరుపేద కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. మద్యం మత్తులో చిన్నపాటి గొడవలు చిలికి చిలికి గాలివానలా మారి గ్రామాల్లో అశాంతికి దారితీస్తున్నాయి. మహిళల పై వేధింపులు పెరుగుతున్నాయని బాధితులు వాపోతున్నారు.

**నిఘా కొరవడింది:** జిల్లాలోని 80 కి పైగా పంచాయతీల్లో వందల సంఖ్యలో బెల్ట్ షాపులు నడుస్తున్నా, క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో తనిఖీలు జరగడం లేదని విమర్శలు వస్తున్నాయి. అప్పుడప్పుడు ఎక్సైజ్ పోలీసులు దాడులు చేస్తున్నాప్పటికీ, అవి మొక్కుబడిగానే సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని పల్లెల్లో బెల్ట్ షాపులను అరికట్టకపోతే భవిష్యత్తు తరాలు నాశనమవుతాయని, అధికారులు వెంటనే స్పందించి ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించాలని, జిల్లా యంత్రాంగం, ఎక్సైజ్ శాఖ ఈ విషయంలో కఠినంగా వ్యవహరించి, బెల్ట్ షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

## శ్రమ జీవులకు ఎర్రజెండానే రక్ష

### సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్

**ప్రజాపక్షం/పానుగల్:** ప్రపంచం శ్రమజీవులకు ఎర్రజెండా మాత్రమే రక్ష, బిజెపి కార్మిక ద్రోహి అని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ అన్నారు. పానుగల్ మండలంలో మేడే వారోత్సవాలు భాగంగా కేతేపల్లిలో సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అ దేశంలో రాష్ట్రాలన్నీ ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతూన్నాయని ఈ పరిస్థితుల్లో 40 శాతం నిధులు రాష్ట్రాలు భరించే పరిస్థితి లేదని గతం మాదిరే 90% భరించాలని ఎర్రజెండా పోరాడుతోందన్నారు. నిధుల కొరతతో రాష్ట్రాలు 40 శాతం భరించలేని పరిస్థితిని కల్పించి పథకాన్ని ఎత్తేసి ఉపాధి కూలీల కడుపు కొట్టాలని బిజెపి కుట్ర పన్నుతోందన్నారు. కార్మికులకు కనీస వేతనం సౌకర్యాలు వసతులు కల్పించాలని సిపిఐ, అనుబంధ కార్మిక సంఘాలు పోరాడుతున్నాయన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మాజీ సర్పంచు కళావతమ్మ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, ఉపసర్పంచు కృష్ణవేణి, మండల కార్యదర్శి డంగు కుర్మయ్య, మండల మాజీ కార్యదర్శి శివకుమార్, వార్డు సభ్యులు డంగు లక్ష్మి , గ్రామ శాఖ కార్యదర్శి కాకంచిన్న నారాయణ, నేతలు పెద్ద హనుమంతు, చెన్నమ్మ, చిన్న కుర్మయ్య, ఆవుల హనుమంతు, పరుశరాముడు, రామాంజనేయులు, కురువ పెంటయ్య, కిరణ్, బీరయ్య, నాగయ్య టప్ప కోటయ్య, నీలమ్మ, దేవమ్మ, బాలపీరమ్మ, ఏఐటీయూసీ నేతలు మద్దిలేటి ఎల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నేటినుంచి ప్రజాపాలనలో వ్యవసాయ, అనుబంధం శాఖలపై అవగాహన

రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నేటినుంచి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అంతటా రైతు వేదికల స్థాయిలో రైతు వారం కార్యక్రమం నిర్వహిస్తునట్లు రంగా రెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు వివిధ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించటం జరుగుతుందని వివరించారు. అందులో భాగంగా సోమవారం నేల ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఎరువుల యాజమాన్యం ప్రకృతి వ్యవసాయం పౌరసరఫరాల శాఖ వినియోగదారులు కోరుకునే సన్న వరి రకాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మంగళవారం ఉద్యాన పంటల సాగు ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపుదల ప్రత్యామ్నాయ పంటల సాగుపైన, బుధవారం బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు, సహకార సంఘాలు ఎఫ్‌పిఓల ద్వారా రైతులకు సేవలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు అంశాలపై వివరించడం జరుగుతుందన్నారు. గురువారం వ్యవసాయ క్షేత్రాలు, సౌర విద్యుత్ కేంద్రాలు పిఎం కుసుమ్ వ్యవసాయ యాంత్రీకరణ డ్రోన్స్ సమగ్ర అవగాహన, శుక్రవారం పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ పశు జాతి అభివృద్ధి, దూడల ప్రదర్శన, గడ్డి విత్తనాలు వేసవిలో పశుసంరక్షణ, మత్య శాఖ చెరువులలో కలుపు మొక్కల నివారణ, వ్యాధుల నియంత్రణ, అధికోత్పత్తికి చర్యలు నీటిపారుదల శాఖ సమర్ధ నీటి విడుదల కొరకై గేట్ల నిర్వహన, ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులు, కాలువలలో కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగింపు వంటి అంశాలపై వివరించనున్నట్లు తెలిపారు. శనివారం కార్యక్రమంలో నీటిపారుదల శాఖ, చెరువులలో కంపచెట్లు, గుర్రపు డెక్క తొలగింపు, సమతుల్య నీటి వినియోగం, కార్యాలయాల పరిశుభ్రత చేపట్టడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఉష పేర్కొన్నారు.

## సమాజసేవలో యువత భాగస్వాములు కావాలి : సిఐ



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలని సిఐ మహేందర్‌రెడ్డి యువకులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆర్‌టిసి ప్రయాణికుల ప్రాంగణం సమీపంలో సాయి యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మండు టెండలో ప్రజల దాహార్తిని తీర్చటానికి సొంత ఖర్చులతో స్వచ్ఛందంగా సాయి యువశక్తి ఫౌండేషన్ సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున, ప్రయాణికులతో పాటు ప్రజలు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి కంట్రోలర్ నారాయణ, ఎస్ఐ, సాయి యువశక్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజావాణి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం జరుగు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఆర్‌డిఒ అనంతరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రజావాణిలో డివిజన్ స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు. కావున ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు.ఒ

## నగరంలో 81 ఆహార కేంద్రాలపై.. జిహెచ్‌ఎంసి ప్రత్యేక తనిఖీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ వింగ్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 59వ రోజు పిల్లలు ఎక్కువగా సందర్శించే ఆహార కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఆదివారం జరిగిన ఈ డ్రైవ్‌లో పాఠశాలలు, పార్కులు, ప్లే జోన్లు, బేకరీలు, ఫుడ్ కోర్టులు వంటి 81 ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆహార వ్యాపారులకు లేబులింగ్, నిల్వ విధానం, పరిశుభ్రత, పురుగు నివారణ చర్యలపై సూచనలు ఇచ్చారు. అనుమానాస్పద ఆహార నమూనాలను సేకరించి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం2006 ప్రకారం ల్యాబ్ పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 14 వ్యాపారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భవిష్యత్తులో అన్ని ఆహార కేంద్రాలు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని జిహెచ్‌ఎంసి వ్యాపారులకు అధికారులు స్పష్టం చేశారు.

### ఎంఎంసి పరిధిలో...

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పిల్లలు అధికంగా సందర్శించే ఆహార కేంద్రాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఆదివారం నిర్వహించిన ఈ డ్రైవ్‌లో పాఠశాలల పరిసరాలు, పార్కులు, బేకరీలు, ఫుడ్ కోర్టులు తదితర ప్రాంతాల్లో మొత్తం 46 కేంద్రాలను పరిశీలించారు. ఆహార భద్రత ప్రమాణాలపై వ్యాపారులకు అవగాహన కల్పించడంతో పాటు అనుమానాస్పద నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించారు. నిబంధనలు ఉల్లంఘించిన 22 కేంద్రాలకు నోటీసులు జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## శ్రమ దోపిడీ చేస్తున్న ప్రభుత్వాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్‌హెచ్‌ఎంలో 510, 730 జిఓలో మిస్ అయినవాళ్లలో నష్టపోయిన ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఏప్రిల్ నెల వేతనంతో పాటు 7 నెలల పిఆర్‌సి ఏరియర్స్ తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామరాజేష్ ఖన్నా కోరారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులకు తక్కువ వేతనాలు వస్తున్నాయని, రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం వీరికి కూడా అమలు చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయడంతో పాటు ప్రతినెల 5లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీని రెగ్యులరైజ్ చేయాలని రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు.

# పరిశీలనకే పరిమితమా?

జూన్‌లోనే పూర్తిస్థాయి అజమాయిషీ?

పూర్తి స్థాయి ఎండీతోనే ఆశించిన ఫలితం?

మెట్రో రైల్ నిర్వహణ పట్ల ఆసక్తికర చర్చ



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** కుతుబ్‌షాహీల ముందు చూపు.. అసఫ్ జాహీల ఆలోచనలతో రూపాంతరం చెందుతూ వస్తున్న షాన్ ఏ షహర్ గ్రేటర్ హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధితో పాటు ఫ్యూచర్‌సిటీని కలుపుకుని...చార్మినార్ నాలుగు మినార్ల తరహాలోనే నాలుగు నగరాలతో విలసిల్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మినీ ఇండియాగా పేరొందిన భాగ్యనగరం అభివృద్ధికి ల్యాండ్‌మార్క్‌లా గుర్తింపు పొందిన హైదరాబాద్ మెట్రో రైల్ పిపిపి విధానం నుంచి ప్రభుత్వం చేతుల్లోకి రావడంతో నిర్వహణ, విస్తరణ హాట్ టాపిక్‌గా మారింది.

పిపిపి విధానంతో అసాధ్యం అనుకున్నది సుసాధ్యం చేసుకుని హైదరాబాద్ అభివృద్ధికి రోల్‌మోడల్‌గా నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోకి రావడంతో మెట్రో ముందడుగు ఎలా? అనేది ఆస్తకరంగా మారింది. ఎల్ అండ్ టీతో కుదిరిన ఒప్పందంలో రూ.1,461.47 కోట్ల విలువైన వంద శాతం షేర్ల బదిలీ జరిగినా.. నగదు బదిలీ ప్రక్రియ పూర్తిస్థాయిలో జరిగితేనే ప్రభుత్వం చేతిలోకి ప్రాజెక్ట్ వస్తుంది. మెరుగ్గా మెట్రో విస్తరణ, నిర్వహణ, భవిష్యత్ ప్రణాళిక, సేవల నేపథ్యంలో హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్ కీలకంగా మారారు. మెట్రో రైల్ ప్రాజెక్ట్ విస్తరిస్తున్న తరుణంలో పూర్తిస్థాయిలో ఎండీ నియామకం అత్యవసరం. మే 1నుంచి మెట్రో రైల్‌ను రాష్ట్ర ప్రభుత్వం టేపఖుత్వం చేసినా.. ఎల్ అండ్ టీ సంస్థ మరో నెలరోజుల పాటు నిర్వహించాల్సి వస్తున్నది. కేవలం కాగితాలపై జరిగినా.. క్షేత్రస్థాయిలో పనులు అలాగే ఉండిపోయాయి. నగదు బదిలీ పూర్తిస్థాయిలో జరిగిన అనంతరమే మెట్రో రైల్‌పై ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో హక్కులు లభిస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. గడచిన మూడు రోజులుగా మెట్రో రైల్ నిర్వహణ, పర్యవేక్షణ తదితర అంశాలపై అధికారులు దృష్టి సారించి పరిశీలిస్తున్నారు. చారిత్రక ప్రాజెక్ట్‌ను ప్రైవేట్ నుంచి ప్రభుత్వం టేపఖుత్వం చేసుకున్న తరుణంలో అదనపు బాధ్యతలతో మెట్రో రైల్‌కు ఎండీని నియమించడం ఒకింత విమర్శలకు తావిస్తున్నది. ప్రధానంగా ప్రభుత్వ రంగ నిర్వహణ అంటేనే నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం అనే అనుమానాలు ఉంటాయి. అటువంటిది టైమ్ టూ టైమ్ ఎయిర్‌పోర్టు తరహాలో నిర్వహణ చేపట్టాలంటే అధికారులు అదే స్థాయిలో విధులు నిర్వహించి సమయం కేటాయించాల్సి ఉంటుంది. అయితే మెట్రో రైల్ ఎండీ బాధ్యతలను నిర్వహిస్తున్న సర్ఫరాజ్ అహ్మద్.. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా కూడా విధులు నిర్వహిస్తున్న విషయం విధితమే. ఇటువంటి పరిస్థితుల్లోనే అభివృద్ధికి చిహ్నంగా పేరొందిన హెచ్‌ఎండీఏను గాడిలో పెట్టలేకపోతున్నారనే విమర్శలు వస్తున్న తరుణంలో సదరు అధికారికి మెట్రో రైల్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించడం చర్చకు దారి తీస్తున్నది. ఏదేమైనా రాష్ట్ర చరిత్రలో కీలక నిర్ణయంగా మారిన హెచ్‌ఎంఆర్‌ఎల్ ప్రాజెక్ట్ బాధ్యతలను పూర్తిస్థాయిలో సమర్థవంతంగా సమయం కేటాయించి నిజాయితీగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించే అధికారుల చేతిలో పెట్టాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

## ఏ ఎన్నికైనా బిజెపిదే విజయం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** రాబోయే ఏ ఎన్నికల్లోనైనా బిజెపి విజయం సాధిస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మీద ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని.. ప్రత్యామ్నాయంగా బిజెపి వైపు ప్రజలు చూస్తున్నారని తెలిపారు. ఆదివారం సోషల్ వర్కర్, విఆర్‌ఫర్‌యు సంస్థ స్థాపకుడు శ్రీరామ్ వెంకటేష్ తదితరులు కేంద్రమంత్రి గంగాపురం కిషనరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ నాయకత్వం బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ యువకులు పార్టీలో చేరి.. రాబోవు కార్పొరేషన్ ఎన్నికలలో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. పదవ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని, సభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## లక్ష మంది విద్యార్థులతో సిఎం ఇల్లు ముట్టడి

పెండింగ్ ఫీజులివ్వకుంటే తిరగబడతాం

వేల కోట్లు కాంట్రాక్టర్లకు.. పేద పిల్లల విద్యకు నిధులివ్వరా?

విద్యార్థుల సదస్సులో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం /హిమాయత్‌నగర్ :** పెండింగ్ ఫీజులివ్వటంలో నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జులైలో ఐదు లక్షల మంది విద్యార్థులతో సిఎం రేవంత్‌రెడ్డి ఇల్లును ముట్టడిస్తామని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్, యువజన సంఘం అధ్యక్షులు జిల్లపల్లి అంజి అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సదస్సుకు కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు పెండింగ్ ఫీజులు చెల్లించకుండా వేల కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్న రాష్ట్రప్రభుత్వ భరతం పడతామని హెచ్చరించారు. ఓ కాంట్రాక్టర్‌కు రూ.7వేల కోట్లు, మరో కాంట్రాక్టర్‌కు రూ.4,500 కోట్లు చెల్లించిన ప్రభుత్వం 14 లక్షల మంది విద్యార్థుల చదువులకు రూ.8వేల కోట్లు ఇచ్చేందుకు మనసు రావటం లేదనిమండిపడ్డారు. పేదవర్గాల పిల్లలు ఉన్నత విద్య చదువుతుంటే పాలకులు ఓర్వలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో విద్యార్థులు తిరగబడతారని హెచ్చరించారు. బిసి వర్గాల పట్ల గత పాలకులెవరూ ఇంత నిర్లక్ష్యం వహించలేదని, కానీ సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బిసిలను చిన్నచూపు చూస్తున్నదన్నారు. బిసి విద్యార్థుల విద్యకు అవసరమయ్యే ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. బడ్జెట్ ఒకరి సొత్తు కాదని అందులో బిసిల కష్టార్జితం ఉన్నదన్నారు. పెండిం గ్ ఫీజులు చెల్లించే తవరకు వదిలిపెట్టబోమని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. సమావేశంలో బిసి సంఘం నేతలు గొరిగె మల్లేశ్, సి.రాజేందర్, అనంతయ్య, శివకుమార్ యాదవ్, చంద్రశేఖర్, పృథ్వీ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## గోరక్షకులు చట్టం పట్ల గౌరవంతో ఉండాలి

నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడవద్దు: సిపి సజ్జనర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోరక్షకులు చట్టం పట్ల అత్యంత గౌరవంతో ఉండాలని, అక్రమ పశు రవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు తెలియజేయాలి తప్ప, ఎట్టి పరిస్థితుల్లోనూ నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనర్ స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకొని నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హైదరాబాద్ సిపి వివిధ గోరక్షక్ సంఘాల ప్రతినిధులతో ఆదివారం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వేళ నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిషనరేట్ సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తూ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పశువధకు సంబంధించి ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా లేదా ఉద్రిక్తతలు పెంచేలా సోషల్ మీడియాలో రీల్స్, వీడియోలు పోస్ట్ చేసే వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. కేవలం పండుగ సమయాల్లోనే కాకుండా ఏడాది పొడవునా పశువైద్యుల ధ్రువీకరణ లేకుండా జరిగే అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామని, సమాచారం కోసం పోలీసు కంట్రోల్ రూమ్ నంబరు 8712661000 ను 24 గంటలూ సంప్రదించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సిపిలు తఫ్సీర్ ఇక్బాల్, ఎం. శ్రీనివాసులు, జాయింట్ సిపి ఎన్. శ్వేత, వివిధ జోన్ల డిసిపిలతో పాటు గోరక్షక్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు కృషిచేయాలి



ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉషశ్రీ

**ప్రజాపక్షం/అబిడ్స్:** ప్రతిమహిళా కార్యకర్త కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేస్తూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉషశ్రీ పిలుపునిచ్చారు. ఆదివారం బొగ్గులకుంటలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు రోజి ఆధ్వర్యంలో మహిళా కాంగ్రెస్ బూత్ స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి వివరించి పార్టీకి గట్టి పునాది అవ్వాలన్నారు. కార్యక్రమంలో టిపిసిసి మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ యాదవ్, పార్టీ మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వీణ గణేష్ అయ్యర్ నృత్య వైభవం



**ప్రజాపక్షం/త్యాగరాయ-గానసభ:** కళా సమర్పణ్ 2026 శీర్షికన త్యాగరాయగానసభలో భరత కళా క్షేత్రం సమర్పణలో నృత్య వేడుక జరిగింది. నరసింహ వైభవం నృత్య రూపకంతో పాటు పది నృత్యంశాలను ప్రదర్శించారు. గురువు వీణా గణేష్ అయ్యర్‌తో పాటు ఆమె శిష్యులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నృత్య గురువులు శిరీష, శ్రీదేవి పాల్గొని వీణ గణేష్ అయ్యర్ నాట్య ప్రతిభను ప్రశంసించారు. డాక్టర్ విరించి శర్మ, గడిల ఆంజనేయులు అతిథులుగా హాజరయ్యారు.

## విద్యతోనే సమాజ మార్పు



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న లుంబిని నాలెడ్జ్ సెంటర్ 3వ వార్షికోత్సవ వేడుకలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఎఫ్‌ఎస్ ఎ.గౌతమి, మందమర్రి ఎంపిపిఎస్ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాస్ జలంపెల్లి, టీఎస్‌ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జంపాల రాజేష్ హాజరై ప్రసంగిస్తూ... విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ చైర్మన్ గ్యార శ్రీనివాసులు, వైస్ చైర్మన్ ఇంద్రకంటి సుధారాణి, ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్ట్ ముత్యాల రాజేష్, ప్రధాన కార్యదర్శి వేముల పవన్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బుడగళ్ల నర్సింగ్‌రావు, కోశాధికారి కదాసి సత్యనారాయణ పాల్గొన్నారు.


## ఆకట్టుకున్న నృత్య వేడుక

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర్ ఆడిటోరియంలో ఏఐఈఎఫ్‌ఫైన్ ఆర్ట్స్ కమిటీ ఫౌండర్ డాక్టర్ ఎం.కాతిర్వేల్ ఆధ్వర్యంలో జరిగిన నృత్య వేడుక ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాకార్ టివి సిఇఒ డాక్టర్ సిరాజుద్దీన్, కాతిర్వేల్ మాట్లాడుతూ సంస్థ నిర్వాహకురాలు రేవతి ప్రసాద్ చేస్తున్న కళా సేవను ప్రశంసించారు.




## సమస్యల పరిష్కారానికి సహకారం

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సికింద్రాబాద్‌కు చెందిన నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు ఆదివారం సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఇంచార్జి ఆదం సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక నేతలతో పాటు తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సమస్యలను సమగ్రంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అఖిలపక్ష నాయకులతో పాటు, స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

## మచ్చల పులికి చోటిద్దాం.. ప్రకృతిని కాపాడుకుందాం

బొటానికల్ గార్డెన్‌లో అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిరుత పులులు మారుతున్న కాలానికి తగినట్లు జీవించగల సామర్థ్యానికి ప్రతీక, వాటిని కాపాడటం అంటే అడవులను, మన భవిష్యత్ తరాలను రక్షించుకోవడమే అని ఎకోటూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్. రంజిత్ నాయక్ పేర్కొన్నారు. అంతర్జాతీయ చిరుతపులి దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్ బొటానికల్ గార్డెన్‌లో ఆదివారం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) ఎకో టూరిజం విభాగం ఆధ్వర్యంలో 'డెక్కన్ వుడ్స్ అండ్ ట్రయల్స్' సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం సేవ్ ఏ స్పాట్ ఫర్ దెమ్ అనే ఇతివృత్తంతో సాగింది. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో చిరుతపులుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ అవసరం, మానవవన్యప్రాణుల సహజీవనం వంటి అంశాలపై సందర్శకులు, వాకర్స్, చిన్నారులకు నిపుణులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రంజిత్ నాయక్ మాట్లాడుతూ బొటానికల్ గార్డెన్ ఒక ప్రకృతి తరగతి గదిగా మారి, పాల్గొనేవారిలో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించిందన్నారు. నివాస ప్రాంతాల్లో గణనీయమైన నష్టం జరిగినప్పటికీ, చిరుతపులులు తమ తెలివితేటలు, చురుకుదనం, వేగంతో మానవ నివాసాల సమీపంలో కూడా ఎలా జీవించగలుగుతున్నాయో వివరించారు. అలాగే వాటి శారీరక బలం, శరీరంపై కనిపించే ప్రత్యేకమైన మచ్చల నిర్మాణం (రోసెట్స్) గురించీ వివరించారు.అడవుల్లో అత్యున్నత వేటగాళ్లుగా ఉన్న చిరుతపులులు ఆహార గొలుసులో కీలక పాత్ర పోషిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుతున్నాయని నిపుణులు తెలిపారు. నివాస ప్రాంతాల విధ్వంసం, అపరిశుభ్రత వంటి కారణాల వల్లే మానవమృగ సంఘర్షణలు పెరుగుతున్నాయని, గ్రీన్ కారిడార్ల సంరక్షణతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ఈ సమస్యను తగ్గించవచ్చని సూచించారు. హెడ్ నేచురలిస్ట్ ఎం. అఖిల్ తన బృందంతో కలిసి భారతీయ చిరుతపులి జీవనశైలిపై ఆసక్తికర వివరాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎకోటూరిజం సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.శిరీష, ప్లాంటేషన్ మేనేజర్లు ఎన్. రాజేంద్ర కుమార్, వి.లక్ష్మారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.శ్రీనివాసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలోని ఉప్పల్ కేంద్రీయ విద్యాలయం 1లో ఏర్పాటు చేసిన నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. నిర్వహణా ఏర్పాట్ల విషయమై కళాశాల నిర్వాహకులను అడిగి తెలుసుకొన్నారు. అభ్యర్థులకు అవసరమైన మంచి నీరు, విద్యుత్ సరఫరా, మూత్రశాలల వంటి మౌలిక సదుపాయలను ఏర్పాటు చేయటంలో ఏ మాత్రం నిర్లక్ష్యం సరికాదన్నారు. అదే విధంగా పరీక్షా కేంద్రాల్లో వేసవికాలం దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకట్లతో పాటు ఇతరఅవసరమైన మందులు,మెడికల్ కిట్ అందుబాటులో ఉండాలన్నారు.

## బహిరంగ సభ విజయవంతం చేయాలి



మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఈ నెల 10న సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న ప్రధాని మోడి బహిరంగ సభను విజయవంతం చేయాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ కోరారు. ఆదివారం బిజెపి నేతలు మోహన్‌యాదవ్, మహేష్ యాదవ్, శేఖర్, సురేష్, మౌలాలి, ఈసిఐఎల్ ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు బొంబాయి రాజు, హరీష్ గౌడ్, రాజు, లక్కీ, ప్రవీణ్‌కుమార్‌లతో కల్సి బహిరంగ సభకు సంబంధించి రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

## మేడ్చల్ జిల్లాలో సిఐల బదిలీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఇనస్పెక్టర్లను స్థానచలనం చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఆజరీ చేసారు. మేడ్చల్ సిఐ సత్యనారాయణ, డిఐ కిరణ్, ట్రాఫిక్ సిఐ మధుసుధన్, జీనోమ్ వ్యాలీ సిఐ గురువయ్యలు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. తాజా బదిలీలతో మేడ్చల్ సిఐగా నరేందర్, మేడ్చల్ డిఐగా జి.రాజశేఖర్, మేడ్చల్ ట్రాఫిక్ సిఐగా నవీన్‌కుమార్, జీనోమ్ వ్యాలీ సిఐగా రమేష్‌లు నియమితులయ్యారు.

## వికలాంగురాలికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** అంగవైకల్యంతో బాధ పడుతున్న మానసిక వికలాంగురాలు సంగీతకు మల్కాజిగిరి కాంగ్రెస్ నేతలు 10 వేల రూపాయలు ఆర్థిక సాయంగా ఆదివారం అందచేసారు. వినాయకనగ్ డివిజన్‌కు చెందిన ఆమె నివాసానికి వెళ్లిన నేతలు పిట్టల నాగరాజు, గుండా నిరంజన్, చిన్నలు ఈ సాయాన్ని అందచేసారు.

## ఇందిరమ్మ ఇంటి కలను నెరవేర్చుతున్నాం

మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని నిరుపేదలకు ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తున్నామని మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ అన్నారు. ఆదివారం మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పోతారంలో నూతన ఇందిరమ్మ ఇంటిని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు కట్టించుటలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ వచ్చిన రెండేళ్లలో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను కట్టిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు వంగ దామోదర్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, మహేష్, బస్వారెడ్డి పాల్గొన్నారు.

## నీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వేసవిలో ప్రజలకు తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అలియాబాద్ మున్సిపల్‌లోని లాల్‌గడిమలక్‌పేటలోని 20వ వార్డులో బోరు ఫ్రషింగ్ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో మండుతున్న ఎండలకు ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పాత బోర్లను ఫ్రెషింగ్ చేయిస్తున్నామని చెప్పారు. మున్సిపల్‌లో సాధారణ నిధులతో బోరు ఫ్రషింగ్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. మున్సిపల్‌లో ఏ వార్డుల్లో కూడ నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్ స్వప్నరాంప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు తాండూరుకు మంత్రి తుమ్మల రాక

**ప్రజాపక్షం/తాండూరు:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం తాండూరులో నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారోత్సవాలలో భాగంగా సోమవారం పట్టణంలోని ఎస్‌విఆర్ గార్డెన్స్‌లో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నిర్వహిస్తున్న రైతు వారోత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు,స్థానిక ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డిలు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

# ఒఆర్ఆర్ ప్రమాదంపై సిఎం ఆగ్రహం

ట్రాఫిక్ నియంత్రణ చర్యల్లో అధికారులు బిజీబిజీ
చర్యలకు ఉపక్రమించిన హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్)పై రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనను అత్యంత బాధాకరమని పేర్కొన్న సిఎం, రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణపై సమగ్ర సమీక్ష అవసరమని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణలో లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దాలని సిఎం సూచించడంతో, రాష్ట్ర పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ఈ క్రమంలో డిజిపి అత్యవసరంగా ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణలో ఉన్న సమస్యలను విశ్లేషించి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచనలు అందించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రధానంగా ప్రమాదాల ముప్పు ఉన్న ప్రాంతాలు (బ్లాక్ స్పాట్లు) గుర్తించడం, వేగ నియంత్రణ చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ నిబంధనల అమలుపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒఆర్ఆర్‌పై స్పీడ్ లిమిట్ అమలు, సిసిటివి నిఘా పెంపు, హైవే పెట్రోలింగ్ బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా రాత్రి వేళల్లో అధిక వేగంతో ప్రయాణించే వాహనాలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించనున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై మార్గదర్శకాలు ఇవ్వడంతో పాటు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నారు. స్కూల్లు, కాలేజీలు, ఐటి సంస్థల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ చర్యల ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణ భద్రతను కాపాడడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.



**ఐదేళ్లలో తెలంగాణలో రోడ్డు ప్రమాదాల గణాంకాలు**

| సంవత్సరం | ప్రమాదాల సంఖ్య | మృతులు | గాయపడిన |
|---|---|---|---|
| 2020 | 19,164 | 6,668 | 18,745 |
| 2021 | 21,315 | 7,557 | 20,107 |
| 2022 | 21,619 | 7,559 | 20,209 |
| 2023 | 22,903 | 7,660 | 21,022 |
| 2024 | 25,934 | 7,281 | 15,401 |

**ప్రమాదాలు పెరుగుతున్న ధోరణి:**
2020లో 19,164 నుంచి 2024లో 25,934కి పెరిగాయి. అంటే ట్రాఫిక్ ఒత్తిడి, వాహనాల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. మృతుల సంఖ్య స్థిరంగా ఎక్కువగానే ఉంది. ప్రతి సంవత్సరం సుమారు 7,000–7,600 మధ్య ప్రాణనష్టం నమోదవుతోంది. 2023లో గరిష్ట మృతులు 7,660 మరణాలు నమోదయ్యాయి, ఇది రాష్ట్ర చరిత్రలో అత్యధిక స్థాయిలలో ఒకటి.

తెలంగాణలో ప్రతి ఏడాది వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటూ, భారీ ప్రాణనష్టం కలుగుతోంది. ముఖ్యంగా ఓవర్ స్పీడింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, రాత్రి డ్రైవింగ్ ప్రధాన కారణాలుగా గుర్తించబడ్డాయి. ఈ గణాంకాలు చూస్తే ట్రాఫిక్ నియంత్రణ, అవగాహన కార్యక్రమాలు, కఠిన అమలు ఎంత అవసరమో స్పష్టంగా తెలుస్తోంది.

# వేసవి సమయాన్ని సక్రమంగా వినియోగించుకోండి





సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు కె.నారాయణ

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** పిల్లలు వేసవి సెలవులలో సమయం వృధా చేయకుండా వివిధ నైపుణ్యాలు నేర్చుకుంటూ వేసవి సమయాన్ని సద్వినియోగం చేసుకోవాడానికి సిఆర్ ఫౌండేషన్‌లోని వేసవి శిబిరం ఏర్పాటు చేస్తున్నామని సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె.నారాయణ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో గల నీలం రాజశేఖర్ రెడ్డి రీసర్చ్ సెంటర్, సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీలోని చిల్డ్రెన్స్ లైబ్రరీలో పిల్లలకు వేసవి సెలవులలో సమయం వృధా చేయకుండా డ్రాయింగ్, పెయింటింగ్, క్రాఫ్ట్ వర్క్స్, సింగింగ్, స్టోరీ రైటింగ్, స్టోరీ టెల్లింగ్, రిడింగ్, క్లే వర్క్, డ్రామా రైటింగ్, ఫ్లైయింగ్ వంటి ఏన్నో వినోదాత్మక, సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో 50 మంది పిల్లలు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారని, పిల్లలకు కాగితంతో క్రాఫ్ట్ చేయడం, ఫాబ్రిక్ పెయింటింగ్ నేర్పించడంతో పాటు క్యారమ్స్, చెస్ వంటి ఆటలు కూడ నిర్వహిస్తున్నారని తెలిపారు. మరింత మంది పిల్లలు కూడ వచ్చి తమ సమయాన్ని చక్కని సృజనాత్మకతకు వినియోగించుకోవాలని తెలిపారు. జ్యోత్స్న ఫాబ్రిక్ పెయింటింగ్, సునీత పేపర్ క్రాఫ్ట్సులలో పిల్లలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ సురేష్‌బాబు, కన్వీనర్ అజయ్ కుమార్, సురవరం సుధాకర్‌రెడ్డి లైబ్రరీ కన్వీనర్ రాజగోపాల్ చెడ్డి, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె.కల్పన, మంజరి, కమిటీ మెంబర్స్ డా.బి.వి విజయలక్ష్మి, డా.కె.పూర్ణచంద్రరావు, సుబ్బరామన్, వెల్లంకి అనిల్, హోమ్ మేనేజర్ శ్రీనివాస్, సిఆర్ ఫౌండేషన్ నివాసితులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. పెద్దేముల్ మండల పరిధి మంబాపూర్ గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరి ధాన్యం పండించే రైతులకు మేలు చేకూర్చడానికే సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్‌ను అందించే రైతులకు లాభం చేకూర్చిన ఏకైక ప్రభుత్వం అన్నారు. డిసిఎంఎస్ అధికారులు సూచలను పాటించి కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యంను తరలించిన విక్రహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ధారాసింగ్, మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జితేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గోపాల్, మైనార్టీ నాయకులు రియాజ్ తదితరులు ఉన్నారు.



## ఘనంగా స్వాగతం పలుకుదాం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌడ్‌లో నిర్వహించే సభను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అంజిరెడ్డి జిల్లా ముఖ్యనాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రత్నం మాట్లాడుతూ.. మోదీ సభకు వేలాదిగా ప్రజలు, కార్యకర్తలు, స్వచ్ఛందంగా ముందుగా వస్తున్నారన్నారు. 3వ సారి ప్రధానమంత్రిగా మొదటిసారి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా మనమంతా ఘనంగా స్వాగతం పలుకుదామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎలాంటి పురోగతి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. జిల్లాలోని యువకులు, మేధావులు, అభిమానులు, బిజేపి నాయకులు ,కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వినర్ కరణం ప్రహ్లదరావు, రాష్ట కార్యవర్గ సభ్యులు శివరాజు, మాధవరెడ్డి, దిశకమిటీ మెంబర్ వడ్ల నందు, శ్రీధర్‌రెడ్డి ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అనిల్‌యాదవ్, పట్టణఅధ్యక్షులు శిరీష తదిరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో

# వరుస బదిలీల ప్రకంపనలు




**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడిపల్లి మండలంలో వరసగా ఇద్దరు తహసీల్దార్లు, నయాబ్ తహసీల్దార్ బదిలీల అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ఇక్కడ కొనసాగుతున్న ఇద్దరు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్‌ను కూడా బదిలీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం. ఇలాంటి వరుస బదిలీలు కేవలం పరిపాలన అవసరాలకు కాకుండా, కొన్ని సమస్యాత్మక భూమి కేసులు, సర్వే నం.33 వంటి రికార్డులపై ఒత్తిడి కోసమేనా అనే అనుమానాలు పెరుగుతున్నాయి. రెవిన్యూ అధికారులు నిబంధనల ప్రకారం పని చేస్తే బదిలీ, ఒత్తిడికి లోబడితే ప్రశంస ఇలాంటి బదిలీలన్నీ రాజకీయ నాయకుల కనుసైగల్లో జరుగుతున్నాయని స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. మేడిపల్లి మండలంపై రెవిన్యూ ఉన్నతాధికారులు, ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి భూరికార్డులు, సర్వే డాక్యుమెంట్లపై ఎలాంటి అక్రమ జోక్యం జరగకుండా చూడాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ పితలాటకంలో అధికారులు, రాజకీయ నాయకుల హస్తం ఉందనే అనుమానాలు తేటతెల్లం చేయాలంటే ఇక్కడ జరుగుతున్న వరుస బదిలీలు,రికార్డు స్వాప్‌లపై తక్షణమే శాఖపరంగా పరిశీలన చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**వరుస బదిలీలపై పలు అనుమానాలు**
మొదటగా ఇద్దరు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్ బదిలీ చేయడం, ప్రస్తతం ఇద్దరూ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్‌ను కూడా బదిలీ జాబితాలో ఉంచారనే ప్రచారం స్థానికంగా జోరుగా జరుగుతోంది. ఇలాంటి బదిలీలు సాధారణంగా జరగవని, కొన్ని భూమి కేసుల సమయంలో మాత్రమే జరుగుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ప్రచారం జరుగుతున్నాయి.

**సర్వే నం.33 లో జోక్యంతోనేనా...?**
మేడిపల్లి మండలం చెంగిచెర్ల సర్వే నం.33 భూములు ప్రస్తుతం అత్యంత సమస్యాత్మక ప్రాంతంగా మారాయి. ఇక్కడ కొన్ని ప్రైవేట్ డెవలపర్లు, దేవాదాయ ట్రస్టు భూములు, కొంత మంది బీఆర్ఎస్ నాయకుల కుటుంబ భూములు కూడా ఒకే రికార్డు సర్వే నంబర్‌లో పొందుపర్చబడి ఉండటంతో వివాదాలకు తావిస్తున్నాయి. ఇలాంటి భూములపై రికార్డులు, సర్వే పత్రాలలో ఎటువంటి మార్పులు జరిగినా ప్రభావం భారీగా ఉంటుంది. అందుకే ఇక్కడ పనిచేసే తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లపై గురి పెట్టి బదిలీలు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానిక వర్గాలను పెద్ద ఎత్తున్న ఊహగానాలు వినిపిస్తున్నాయి.

**బదిలీల వెనక హస్తమెవరిది....?**
మేడిపల్లి మండలంలో జరుగుతున్న వరుస తహసీల్దార్లు,నయాబ్ తహసీల్దార్ బదిలీలు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు సర్వేయర్‌పై బదిలీలు జరుగుతాయని వార్తలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ బదిలీలలో ప్రతిపక్షానికి చెందిన ఓ నాయకుడి హస్తం ఉందనే ఊహాగానాలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. సర్వే నం.33 భూముల రికార్డులు తారుమారు కోసం రెవిన్యూ ఉన్నతాధికారులు, ప్రస్తుత ప్రభుత్వం వైపు నుంచి జరిగే ప్రయత్నంలా ఉన్నాయనే అనుమానాలు ప్రజల నుండి రేకెత్తిస్తున్నాయి.

**మేడిపల్లి మండలంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**
**రచ్చ కిషన్,మేడిపల్లి మండల సిపిఐ కార్యదర్శి**
మేడిపల్లి మండలం చుట్టూ జరుగుతున్న వరుస బదిలీలు, సమస్యాత్మక భూమి రికార్డుల మార్పులు చూసి ప్రజల్లో ఆందోళన రోజురోజుకీ పెరుగుతోంది. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్లు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లు నిబంధనల ప్రకారం నిష్పాక్షికంగా పనిచేస్తే వారిని బదిలీ చేయడం కాకుండా, వారికి రక్షణ కల్పించాలి.



## ప్రశాంతంగా ముగిసిన నీట్

**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా కేంద్రంలో నాలుగు జెడ్పిహెచ్ఎస్ బాలురు, జెడ్పిహెచ్ఎస్ బాలిక, పరీక్ష కేంద్రాలలో నీట్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సెంటర్లను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మొత్తం 1179కిగాను 1148మంది విద్యార్థులు హాజరయ్యారు. 97.37శాతం నమోదైంది.

## విషయ పరిజ్ఞానం, ఉత్తమ ఫలితాలతోనే ఉజ్వల భవిష్యత్తు



బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**ప్రజాపక్షం/దుండిగల్ :** ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ సాధించిన గాయత్రి గ్రామర్ స్కూల్ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంతో కలిసి కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మర్యాదపూర్వకంగా కలువగా, టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, స్కూల్ యాజమాన్యంను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల టాపర్ ఇక్రా ఫాతిమా 579 మార్కులతో ప్రథమ స్థానం సాధించగా, సమ్రా తహ్రీమ్ 562 మార్కులతో ద్వితీయ స్థానం, అఫ్రీన్ 560 మార్కులు, అఖిల్ 555 మార్కులతో ప్రతిభ కనబరిచారు. అలాగే నూరుల్లా, సాయి చందు సబ్జెక్ట్ టాపర్స్‌గా నిలిచారు. విద్యార్థులను ప్రోత్సహించి ఆశీర్వదించిన ఎమ్మెల్యే మరియు వారి బృందానికి గాయత్రి గ్రామర్ హైస్కూల్ యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విషయ పరిజ్ఞానం పెంపొందించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించినపుడే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, ప్రతీ ఒక్క విద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ నగర్, ఐడీపీఎల్‌లోని గాయత్రి గ్రామర్ హైస్కూల్ డైరెక్టర్ గాయత్రి, ప్రిన్సిపల్ డా.హేమలత, పాఠశాల టాపర్స్ మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## అంబేద్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నత్తి మైసయ్య డిమాండ్

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 376వ ఆదివారం జ్ఞానమాల సమర్పించి భారత రాజ్యాంగ నిర్మాణం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం నత్తి మైసయ్య మాట్లాడుతూ నేటి విద్యార్థులకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భవిష్యత్ తరాలకు అంబేద్కర్ చరిత్రను తెలియజేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని అందుకు పాఠ్యాంశాలలో అంబేద్కర్ జీవిత చరిత్ర చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, ఎం.దాసు పర్వతాలు, సగ్గు నరసింహ, చిల్ల అంజయ్య, ఏ.రాజేష్, జి.వెంకటేశ్వర్లు గరుగుల స్వర్ణ రాజు ఇతరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాంబరాజు రవి జయంతి



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి మాజీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, దివంగత నాయకులు సాంబరాజు రవి 42వ జయంతి వేడుకలు ఆదివారం (మే 3) జవహర్‌నగర్‌లోని అంబేద్కర్ నగర్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శాగంటి వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ నగర్ కాలనీలోని రజక మినీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంబరాజు రవి ఆశయాలను స్మరిస్తూ, ఆయన సమాజానికి చేసిన సేవలను నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ మీడియా సెక్రటరీ రాపర్తి అజయ్, మేడ్చల్ యూత్ అధ్యక్షులు పోలాస సాయి కుమార్,కాప్రా అధ్యక్షులు కిరణ్, ప్రసాద్, సభ్యులు, చిట్యాల సత్తయ్య, ఇటిక్యాల సిద్దయ్య, అల్లుగునూరి దశరథ్, రుద్రాక్ష సత్యనారాయణ, వడ్లకొండ రమేష్, చీమల కొండూరు క్రాంతి, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ వేడుకలు మే 10 వరకు కొనసాగుతాయి. ప్రతి రోజు ఒక కార్యక్రమం జరుగుతున్నందున భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్నారు. 1945లో గుడి జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్మితమవగా.. ఆయన వంశీయులే ఆలయ పాలన బాధ్యతలను నిర్వహిస్తున్నారు. 1981లో ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. కార్యక్రమాలు ఆలయ వ్యవస్థాపక వంశీయులు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్ గౌడ్, కార్య నిర్వహణ అధికారిణి వంగ అంబుజీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

